ప్రజాశక్తి

గురువారం 17 ఏప్రిల్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

జెడ్‌పి నిధులపై ఎమ్మెల్యేల పెత్తనమా?

చైర్‌పర్సన్ పోడియాన్ని చుట్టుముట్టిన జెడ్‌పిటిసిలు

జెడ్‌పి చైర్‌పర్సన్ పాడియాన్ని చుట్టుముట్టిన జెడ్‌పిటిసి సభ్యులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జెడ్‌పిటిసి నిధులపై ఎమ్మెల్యేల పెత్తనం సరికాదని పలువురు జెడ్‌పిటిసిలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ముందుగా అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణాసంచా ప్రమాద ఘటనపై సమావేశం కాసేపు మౌనం పాటించింది. సభకు అధ్యక్షత వహించిన జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వైద్య ఆరోగ్య, విద్యా, పంచాయతీరాజ్, రూరల్ వాటర్ సప్లై, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు తదితర శాఖల అంశాలపై చర్చ జరిగింది. జిల్లా పరిషత్‌కు సంబంధించి చేపడుతున్న అభివృద్ధి పనులపై సలహాలు, సూచనలు ఇవ్వాలని సభ్యులను జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర కోరారు. దీనిపై మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ, జెడ్‌పిటిసి సభ్యునిగా తనకు మంజూరైన నిధులను వివిధ అభివృద్ధి పనులకు కేటాయించి, వాటిని చేయాలని అధికారులను లిఖిత పూర్వకంగా కోరుతున్నా జరగటం లేదన్నారు. పనులు ఎందుకు జరగడంలేదని ప్రశ్నిస్తే యలమంచిలి ఎమ్మెల్యే చెబితే తప్ప తాము పనులు చేసేది లేదని అధికారులు అంటున్నారని వివరించారు. జెడ్‌పి నిధులపై ఎమ్మెల్యేల జోక్యం దేనికని ప్రశ్నించారు. ఈ సమస్యను అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరవాడ జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు, మరి కొంతమంది వైసిపి జెడ్‌పిటిసిలు ఇదే సమస్యపై మాట్లాడుతూ, తమకు కూడా ఇటువంటి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని, అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని చైర్‌పర్సన్‌ను డిమాండ్ చేస్తూ, పోడియాన్ని చుట్టుముట్టి నిరసన తెలిపారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని, ఇటువంటి సమస్య లేకుండా చూస్తామని చెప్పడంతో వారు శాంతించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలు జరిగిన అనంతరం చేపడుతున్న తక్షణ సహాయ కార్యక్రమాల కంటే ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చేపడుతున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మిగతా 2లో..

వార్త మెయిన్ 3లో..

ర్యాలీలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

బుల్డోజ్ పాలన రాష్ట్రానికి తేవొద్దు..

20న సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 20న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావుతో కలిసి బుధవారం మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు అఖిలభారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరావు, సిహెచ్.నర్సింగ రావు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల యూనియన్స్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ 300 మంది హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కౌన్సిల్ సమావేశంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మే 20వ తేదీన "లేబర్ కోడ్స్ రద్దు" చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టే అఖిల భారత సమ్మె జయప్రదం కోసం, 'మేడే' నిర్వహణపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.

వేట నిషేధ భృతి రూ.40 వేలు ఇవ్వాలి : సిపిఎం

▶ వార్త 5లో..

ఐదేళ్ల కుమార్తెపై అత్యాచారం

▶ వార్త మెయిన్ 3లో..

'చైతన్య'లో విద్యార్థి ఆత్మహత్య

▶ వార్త మెయిన్ 3లో..

మేయర్ పీఠంపై టిడిపి కుట్ర

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి మేయర్ పీఠాన్ని అడ్డదారిలో దక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీ కుట్రలు చేస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. వైసిపి నగర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బలం లేకపోయినప్పటికీ మేయర్ పదవిపై అవిశ్వాసం తీర్మానానికి టిడిపి నోటీసు ఇవ్వడం వెనుక వారి కుతంత్రం దాగి ఉందని మండిపడ్డారు. విశాఖ మేయర్ పీఠంపై యాదవ సామాజికవర్గానికి చెందిన బీసీ మహిళ కూర్చోవడాన్ని తెలుగుదేశం జీర్ణించుకోలేక పోతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వైసిపి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఫ్యాన్ గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లను ప్రలోభపెట్టి, లొంగని వారిని బెదిరించి, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి కూటమిలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. వైసిపి నుంచి ఫ్యాన్ గుర్తుపై గెలిచిన 58 మంది సభ్యులకు రేపు విప్ జారీ చేస్తామని తెలిపారు. ఈనెల 19న నిర్వహించనున్న అవిశ్వాస తీర్మాన కార్యక్రమానికి కూడా వెళ్లకూడదని పార్టీ నిర్ణయించిందని వివరించారు. పార్టీ విప్ ధిక్కరించి హాజరైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ, యాదవ కులానికి చెందిన బీసీ మహిళకు జగన్మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నుంచి మేయర్ పదవిని చేజిక్కించుకోడానికి అడ్డదారులు తొక్కుతోందని ఆరోపించారు. కేవలం 11 నెలల కాలమే ఉన్న మేయర్ పీఠం కోసం అరాచకం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, నగర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మనసంతా పరిశ్రమాధిపతులపైనే..!

- గ్రామాల మధ్య నుంచి రోడ్డు విస్తరణ
- కొలతలు తీసిన ఎపిఐఐసి
- ఇళ్లు పోతాయన్న భయంలో జనం
- వారి వేదన పట్టని ఎమ్మెల్యే, ఎంపీ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి విలేకరి

జిల్లాలో కొత్త పరిశ్రమలు వచ్చిందీలేదు, వచ్చిన కంపెనీల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పించిందీ లేదుగాని తలదాచుకున్న నీడను కూడా పేదలకు ప్రభుత్వం లేకుండా చేస్తోంది. ప్రజా ప్రయోజనాల పేరుతో భూములు సేకరించి పరిశ్రమాధిపతులకు కేటాయిస్తోంది. వారికి కల్పించే సౌకర్యాలు, సదుపాయాల్లో సామాన్యుల బతుకులను దెబ్బతీస్తోంది. భూము లిచ్చి జీవనోపాధి పోగొట్టుకున్నామన్న బాధ వెంటాడుతుండగానే, రోడ్డు విస్తరణ ప్రతిపాదనలతో కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. యలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు, ఉపాధి కోల్పోయే బాధితులకు పరిహారం చెల్లింపు సమస్య తీర్చకుండానే, ఆ నియోజకవర్గంలోని రాంబిల్లి మండలంలో రోడ్డు విస్తరణ, భూ సేకరణ ప్రక్రియకు ఏర్పాట్లుచేయనారంభించారు. రాంబిల్లి మెయిన్ రోడ్డు నుంచి కొండవారుపాలెం, గజిరెడ్డిపాలెం, లోవపాలెం మీదుగా కావిడిమెట్ల వరకు వంద అడుగుల రోడ్డు విస్తర్ణకు చర్యలు ప్రారంభించి మరో సమస్య ముందుకుతెచ్చారు. పచ్చనిచెట్ల మధ్య ప్రశాంత జీవితం గడిపే పరిసరాలన్నీ పరిశ్రమలతో ప్రభుత్వం కలుషితం చేసింది. విషపూరిత వాయువుల మధ్య జీవనం సాగిస్తున్నవారి ఇళ్లు రోడ్డు విస్తరణలో పోతాయని తెలిసి అల్లాడిపోతున్నారు. ఇళ్లు పోతే ఎక్కడకు పోవాలి? ఎలా జీవించాలి? అనే ప్రశ్నలు వారిని సంధిస్తున్నాయి.

రోడ్డు విస్తరణ గ్రామాల్లో ఏళ్లతరబడివున్న తాగునీటి మిగతా 2లో..

కెజిహెచ్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటుకు సిఫారసు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో జన్మదిన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్న కేంద్రం ఆవరణలో ఆధార్ కేంద్రం ఏర్పాటుచేసేలా విశాఖ జిల్లా ఉన్నతాధికారులకు సిఫారసు చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తమ కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల ఆసుపత్రి ఉన్నతాధికారులు ప్రసూతి వార్డు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన నూతన జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రాన్ని బుధవారం ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వి.రవి, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బివి.రమణ, ఆసుపత్రి సిఎస్ఆర్ ఎం.ఒ. జి.మెహర్ కుమార్, చిన్న పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బిఎస్.చక్రవర్తి, ప్రసూతి విభాగం వైద్యులు డాక్టర్ కె.శ్యామల, డాక్టర్ సువిధ తదితరులతో కలిసి సందర్శించారు. అనంతరం వీరితో సీతారాం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కేంద్రం తాత్కాలిక ఊరటగా భావించకుండా, శాశ్వత పరిష్కారంగా నిలవాలని సూచించారు. ఈ కేంద్రంలో ఆధార్ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు జరిగేలా జిల్లా అధికారులకు సిఫారసు చేయనున్నట్టు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో స్టాటిస్టికల్ అధికారి దయానిధిరావు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ శంకర్రావు, నోడల్ ఆఫీసర్ శ్రీకర, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎవి.రమణకుమారి, శ్రీలత, ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.మమత, వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధులు శరణ్య, మాలతి, శాంత, సుజాత, రామలక్ష్మి, కౌన్సిలర్ శకుంతల, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమతా ఎక్స్‌ప్రెస్ రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నాగ్‌పూర్ డివిజన్‌లోని రునిజా- కలమ్నా స్టేషన్ల మధ్య 3వ లైన్ ప్రారంభించడానికి ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ పనులకు సంబంధించి ప్రీ-నాన్-ఇంటర్ లాక్, నాన్-ఇంటర్ లాక్ పనులకు ట్రాఫిక్ బ్లాక్ కారణంగా 12807 విశాఖపట్నం-నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 30, మే 1, 3, 4, 6 తేదీల్లోనూ, 12808 నిజాముద్దీన్ - విశాఖపట్నం సమతా ఎక్స్‌ప్రెస్‌ను మే 2, 3, 5, 6, 8 తేదీల్లో రద్దు చేశారు. ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే అధికారులు కోరారు.

10,11 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిపిఐ జిల్లా మహాసభలు మే 10, 11 తేదీల్లో నగరంలో నిర్వహిస్తున్నామని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు తెలిపారు. అల్లిపురం, సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు కంచరపాలెం మెట్టు నుంచి ఓల్డ్ ఐటిఐ జంక్షన్ వరకు ప్రజా ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి ప్రసంగిస్తారని తెలిపారు. 11న ఉదయం 9 గంటలకు మురళీనగర్‌లోని బి స్క్వేర్ ఫంక్షన్ హాల్లో ప్రతినిధుల సభజరుగుతుందని వివరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, ఎం.మన్మధరావు, పాత్రపల్లి చంద్రశేఖర్, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎస్‌కె.రెహమాన్, సిఎన్ క్షేత్రపాల్, జి.రాంబాబు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో దిశా సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దిశ (డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) జిల్లాస్థాయి అభివృద్ధి సమన్వయ సమావేశం గురువారం ఉదయం 10.30 గంటల నుంచి విశాఖపట్టణం ఎంపీ ఎం.శ్రీభరత్ అధ్యక్షతన కలెక్టరేట్ మీటింగు హాలులో జరగనుందని జిల్లా పరిషత్ సిఇఒ, దిశా కన్వీనర్ పి.నారాయణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వాటి మార్గదర్శకాలు, ప్రయోజనాలపై ఎంపీ సమీక్షించనున్నారని, అధికారులంతా పక్కా నివేదికలతో హాజరుకావాలని కోరారు.

అందుబాటులోకి సామ్‌సంగ్ హెచ్ఆర్ఎం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ తన హోమ్ అప్లియెన్సెస్ రిమోట్ మేనేజ్‌మెంట్ (హెచ్ఆర్ఎం) సాధనాన్ని ప్రారంభించినట్లు సామ్‌సంగ్ కస్టమర్ విభాగ హెడ్ సునీల్ కుటిన్హా తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఇది సేవా నిరీక్షణ సమయాలను గణనీయంగా తగ్గించి, కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరిచే తదుపరి తరం రిమోట్ డయాగ్నసిస్, ట్రబుల్ షూటింగ్ పరిష్కారం చేస్తుందని పేర్కొన్నారు. ఎఐ ఆధారిత రిమోట్ డయాగ్నస్టిక్స్, ట్రబుల్ షూటింగ్ శక్తిని ఉపయోగించుకోవడం ద్వారా సామ్‌సంగ్ సాంకేతిక నిపుణులు ఇప్పుడు సమస్యలను వేగంగా పరిష్కరించగలరని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

జెడ్‌పి నిధులపై ఎమ్మెల్యేల పెత్తనమా?

ఏజెన్సీ ప్రాంతాలలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అచ్యుతాపురం జెడ్‌పిటిసి లాలం రాంబాబు, మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ, అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న రోడ్డును వివిఎంఆర్‌డిఎ ఆధ్వర్యాన 100 అడుగుల వెడల్పుతో విస్తరించే కార్యక్రమాన్ని చేపడుతున్నారని, ఈ విస్తరణలో గృహాలు, షాపులు, భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారంగా నగదు బదులు టిడిఆర్‌లు ఇవ్వడం సరికాదన్నారు. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. నష్టపరిహారాన్ని చెక్కుల రూపంలో బ్యాంకులలో జమ చేయాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సమావేశంలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణ తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో నాడు-నేడు పథకంలో అనేక ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే పనులు చేపట్టారని, ప్రభుత్వం మారడంతో కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని పలువురు జెడ్‌పిటిసిలు కోరారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు, ఉన్న ఇబ్బందులు ఏమిటి అని ప్రశ్నించారు. అధికారులు ఇచ్చిన వివరణ అనంతరం వారు మాట్లాడుతూ, జెడ్‌పి, పంచాయతీరాజ్, ఎన్ఆర్ఇజిఎస్ వంటి శాఖల ఆధ్వర్యాన సమావేశాన్ని దీనిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, తగు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. మునగపాక మండలంలో కొన్ని పాఠశాలల భవనాలు అసంపూర్తిగా ఉన్న విషయాన్ని జెడ్‌పిటిసి స్వామి సత్యనారాయణ సభ దృష్టికి తీసుకొచ్చారు. అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, మార్చురీ వద్ద అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నారని, దీనిని అరికట్టాలని ఆయన ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ప్రత్యేక కవర్‌తో కప్పేలా ఏర్పాటుచేయాలని కోరారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, ఫార్మా కంపెనీలలో, ఇతర ప్రమాదాలలో మరణించిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఒకే రకమైన ఎక్స్‌గ్రేషియాను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ సమావేశంలో అరకు పార్లమెంటు సభ్యులు గుమ్మా తనూజారాణి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎఎస్ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, రేగం మత్స్యలింగం, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రజల సమస్యలను ప్రస్తావించిన గంగరాజు

జెడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న గంగరాజు

ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ఏజెన్సీలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను లేవనెత్తారు. వైద్య ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, అనంతగిరి మండలాల నుంచి వివిధ ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను, వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులను, విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స కోసం ముందుగా తరలిస్తున్నారని తెలిపారు. అత్యవసర కేసులు ఉంటే కెజిహెచ్‌కు రిఫర్ చేయకుండా విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించడం వలన సరైన వైద్యం అందక రోగులు మరణిస్తున్నారని తెలిపారు. విశాఖ కెజిహెచ్‌లో సరైన వైద్యం అందుతుందని, దీనిపై అల్లూరి జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, 108 అంబులెన్స్‌లో కెజిహెచ్‌కు పంపేలా అనుమతులు కోసం కృషిచేయాలని కోరారు. అల్లూరి జిల్లా ఏజెన్సీ పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న అంబులెన్స్ డ్రైవర్లకు ఎన్‌హెచ్ఎం సంస్థ ద్వారా రూ.15 వేలు ఇస్తున్నారని, ప్రస్తుతం పెరిగిన ధరలతో పోల్చితే ఈ వేతనం ఏమాత్రమూ సరిపోదని, వీరందరిని ఐటిడిఎలో కలిపి జీతాలు పెంచాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. అదనపు డ్రైవర్లు నియమించాలని తీర్మానం చేయాలని కోరారు. సిహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా ప్రమోట్ చేయాలని, ఏజెన్సీ పిహెచ్‌సి కేంద్రాల వైద్యులకు ఏజెన్సీ అలవెన్స్ ఇవ్వాలని కోరారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా 11 మండలాల్లో 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, చింతపల్లిలో 696 మంది, సీలేరులో 294 మంది, బాకురులో 214 మంది, బలరాంలో 131 మంది, జోలాపుట్‌లో 239 మంది, పెదబయలులో 391 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి వసతి గృహాలు లేనందున చదువుకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. పాఠశాలల్లో బెంచీలు, బాత్రూమ్స్ లేవని, కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లోనే హాస్టల్ ఏర్పాటుచేసేలా జిల్లా పరిషత్ సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మనసంతా పరిశ్రమాధిపతులపైనే...!

సమస్యను పట్టించుకోని వారంతా పరిశ్రమలకు వెడల్పైన రహదారుల నిర్మాణాలకు శ్రద్ధపెట్టడంపై ప్రజలు భరించలేకపోతున్నారు. పరిశ్రమలకు మరింత సదుపాయమైన రహదారుల కోసం రాంబిల్లి రోడ్డు నుంచి కొండవారుపాలెం, గజిరెడ్డిపాలెం, లోవపాలెం మీదుగా కావిడిమెట్ల వరకు తొలుత వంద అడుగుల రోడ్డు విస్తరించాలని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) చర్యలు ప్రారంభించింది. ఈ గ్రామాల్లో రెవెన్యూ యంత్రాంగంతో కలిసి రోడ్డు విస్తరణకు కొలతలు తీసింది. తొలగించాల్సిన ఇళ్లపై అధికారులు అవగాహనకు వచ్చారు. రహదారుల విస్తరణ కొలతలతో తమ ఇళ్లు పోతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు పోతే, ఒక్కో ఇంట్లో తలదాచుకుంటున్న మూడు, నాలుగు కుటుంబాలన్నీ ఎక్కడ ఉంటాయని కొండవారుపాలెం ఎస్‌సి కాలనీకి చెందిన భూపతి అప్పలనాయుడు అన్నారు. భూమి లేకపోయినా ఊరును నమ్ముకొని బతికేవాళ్లమని, రోడ్డు విస్తరించి ఈ బతుకూలేకుండా చేయడం న్యాయమేనా? అని ప్రశ్నించాడు. రోడ్డు విస్తరణలో ఇళ్లుపోతాయని భయపడుతున్న ప్రజలకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎంపీ సిఎం రమేష్ భరోసా ఇవ్వలేదు. వీరి వేదన పట్టించుకోలేదు. తమ బతుకుల కంటే పరిశ్రమల కోసం రోడ్డు విస్తరించాలనే ఆలోచనలో వారిద్దరున్నారని స్థానికులు చెబుతున్నారు.

అధికారులతో మంత్రి సమీక్ష

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఎస్‌సి కార్పొరేషన్, ఎస్‌సి ఇంజినీర్ సెక్షన్, సోషల్ వెల్ఫేర్, రెసిడియల్ స్కూల్ పనితీరుపై బుధవారం విశాఖలోని ప్రభుత్వ అతిథి గృహంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, ఈఈ రమేష్, పలువురు అధికారులు హాజరయ్యారు.

మహారాజశ్రీ యలమంచిలి సీనియర్ సివిల్ డివిజన్ జడ్జి వారి కోర్టులో
E.P.No.15/2020 in O.S.No. 9/2013

బిట్వీన్:
రుత్తల శంకరరావు ... DHR
అండ్:
కాళ్ళ సత్యనారాయణ ... JDR
టు: కాళ్ళ సత్యనారాయణ
S/o (లేటు) నారాయణ,
డో.నెం. 20-25, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి,
రామ్‌నగర్, వార్డునెం.18, పెదపల్లి రోడ్డు,
యలమంచిలి, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు అమలులో యిందలి JDR కి ఆర్డర్ 21 Rule 66 C.P.C. Notice పంపించిన మీరు పుచ్చుకొనకుండా తప్పించుకొన్నందున సదరు నోటీసు మీకు సర్వీసు నిమిత్తం ఈ పేపరు మూలంగా మీకు తెలియజేయడమైనది. పై నెంబరు అమలు వాయిదా **తే: 01-05-2025దీని** మీరు ఖద్దున గాని, వకీలు ద్వారా పై కోర్టులో హాజరుఅయి మీ ఆక్షేపణలు కోర్టు వారికి తెలియపర్చుకొనగలరు. లేనియెడల పై నెంబరు అమలులో మీ పరోక్షంగా తీర్మాణం చేయడమగునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)
డి.నాగేశ్వరరావు
యలమంచిలి — **DHR** తరపు అడ్వకేటు,
తే:16-4-25 — యలమంచిలి.

IN THE HON'BLE COURT OF V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT : VISAKHAPATNAM
O.S.1221/2022

Between:
CANARA BANK,
(erstwhile Syndicate Bank)
Chinawaltair Branch,
Visakhapatnam ...Plaintiff
And
NR Travels, Rep by its Managing Partner Shri P Naresh & another ...Defendants

SUMMONS

To,
D-1:N R Travels, a partnership firm, Reg. Office situated at Plot No.58, MIG-1, 2nd Floor, Sector 3, MVP Colony, Visakhapatnam-530016, Rep.by its Managing partner Poosala Naresh, S/o.Poosala Apparao, aged 38 years, presently residing at D.No.8-3-13, Flat No.202, Sree Lakshmi Narayana Vihar, Vijayanagar Palace, Pedawaltair, Visakhapatnam-530017.

Please take notice that the above named Plaintiff has filed O.S.1221/2022 against you and another and the said matter is posted on **25-04-2025** for your appearance. You are hereby required to appear before the Hon'ble court either in person or through duly instructed Advocate on **25-04-2025** at **10.30 A.M** to answer all material questions, failing which the above suit will be heard and determined in your absence, and the Hon'ble court will proceed further in accordance with law.

(By Order of the Hon'ble court)
Smt. **N. Nalini,** Advocate
Visakhapatnam, Cell: 9346308183.

IN THE HON'BLE COURT OF THE III ADDL.CIVIL JUDGE (JUNIOR DIVISION) AT : VISAKHAPATNAM
O.S.1350/2021

Between:
The Karur Vysya Bank Limited, Gopalapatnam Branch, Visakhapatnam, Rep. by its Branch Manager ...Plaintiff
And
Mrs. Rowthu Krishnaveni & another ...Defendants

SUMMONS

To,
D-1: Mrs. Rowthu Krishnaveni, W/o. R. Lakshmana Rao, R/at HIG-2-199, Beside SBH Bank, Sagar Nagar, Visakhapatnam-45.
D-2: R. Lakshmana Rao, S/o. R. Pydital, R/at. Rest -do-

Please take notice that the above named plaintiff has instituted the above suit against both of you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **23-04-2025** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **23-04-2025** at **10:30 A.M** in the above Hon'ble Court,failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

K.V. RAMA MURTHY,
K. NARASIMHA MURTY,
Advocates, Visakhapatnam.

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ జడ్జి వారి కోర్టులో (సీనియర్ డివిజన్)
E.P. 25/2018 O.S. 66/2016

Between :
Devada Govindarao **...Decree Holder**
And
Bolem Bhaskararao
...Judgment Debtor

బహిరంగ వేలం ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు స్తిరాస్తి ఇందలి జడ్జిమెంట్ డెటార్‌కు చెందినదయి, డిక్రీ హోల్డర్ ఈ పి 25/2018: ఓయస్ 66/2016 దావానుపై కోర్టులో డిక్రీ పొంది ఈ పి 25/2028 దాఖలు చేసి సదరు షెడ్యూలు ఆస్తిని వేలం వేయుట ద్వారా విక్రయించ బడునని పై కోర్టువారు ఉత్తర్వుల ప్రకారం **తే.30-4-2025 తేదిన** షెడ్యూలు ఆస్తిని పై కోర్టులో వేలం వేయబడును. కావున ఆసక్తి గల పాటదారులు **ఉ.10:00లకు** హాజరయి షెడ్యూలు ఆస్తిని పై కోర్టులో వేలం పాడుకోవలసినదిగా తెలియచేయడమైనది.

షెడ్యూలు

విశాఖపట్నం ప్రస్తుతం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్ (డి) నర్సీపట్నం మండలం, నీలం పేట గ్రామం తాలూకు జిరాయతి మెట్టు సర్వే నెం 80/8 లో య.0-78 సెంట్లు
హద్దులు : తూర్పు: లాలం కమల (యస్ శ్రీనివాసరావు అమ్మినది) భూమి.
దక్షిణం : మండల రాజు భూమి.
పడమర : గండేపల్లి భాస్కర రావు భూమి.
ఉత్తరం : గండేపల్లి భాస్కర రావు భూమి.

నర్సీపట్నం — **డిక్రీ హోల్డర్ తరపు**
16-4-2025 — **అడ్వకేట్**

అంబికా బాగ్ కల్యాణ మండపం లీజు బకాయి చెల్లింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఓల్డ్ టౌన్‌లోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి చెందిన జగదాంబ జంక్షన్‌లోని దత్తత దేవాలయం అంబికా బాగ్ శ్రీ సీతారామస్వామి దేవస్థానం కల్యాణ మండపాన్ని లీజుకు తీసుకున్న కాంట్రాక్టర్ లీజు బకాయి చెల్లించని విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శోభారాణి కాంట్రాక్టర్‌కు నోటీసు ఇస్తూ బకాయి చెల్లించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఇదే అంశంపై ప్రజాశక్తిలో ఈ నెల 6వ తేదీన 'కళ్యాణ మండపం లీజు బకాయి'శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ పూర్వ రంగంలో కల్యాణ మండపం లీజుదారు, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ కొల్లి సింహాచలం కుమారుడు అయిన శ్రీనివాసరావు రూ.10 లక్షలను లీజు బకాయి కింద చెల్లించారు. ఈ విషయాన్ని శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం కార్య నిర్వహణాధికారి శోభారాణి ప్రజాశక్తికి తెలిపారు. జిఎస్‌టితో కలిపి లీజు బకాయి రూ.24.53 లక్షలు ఉన్నాయని, ఇందులో రూ.10 లక్షలు చెల్లించారని తెలిపారు. వారం రోజుల తర్వాత మిగిలిన సొమ్ము చెల్లిస్తానని లీజుదారు చెప్పినట్లు పేర్కొన్నారు. ఆయన కోరిన గడువులోగా మిగిలిన బకాయి చెల్లించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

సోనియా, రాహుల్‌పై ఈడీ కేసులకు ఖండన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై ఈడీ అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ ఆధ్వర్యాన దాబాగార్డెన్ జంక్షన్‌లో బుధవారం నిరసన తెలిపారు. ఈడీ డౌన్ డౌన్, రాహుల్ గాంధీ జిందాబాద్, జై కాంగ్రెస్, జై జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ, బిజెపి కక్షపూరిత రాజకీయాలు చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈడీ బిజెపి జేబు సంస్థగా మారిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గారా సూర్యారావు, కెవి.సూర్యనారాయణ, అబిదా బేగం, నర్సరీన్, మహమ్మద్ హర్షద్ భాషా, దేవా, డాక్టర్ రాఘవులు, డాక్టర్ రంగనాథ రాయ్ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మరాజు నేతృత్వంలో బుధవారం ఎంవిపి.కాలనీలోని ఈడీ కార్యాలయం ఎదుట నాయకులు నిరసన తెలిపారు. నేషనల్ హెరాల్డ్‌కు చెందిన ఆస్తులను ఏకపక్షంగా అన్యాయంగా స్వాధీనం చేసుకోవడం, సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ కేసులు నమోదుచేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణమే కేసులను ఈడీ ఉపసంహరించుకోవాలని, లేదంటే తీవ్రమైన పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేగి వెంకటేష్, గాధం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దెబోర కుమారికి డాక్టరేట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఎఎస్ఇ కళాశాల విద్యా విభాగ పరిశోధక విద్యార్థిని ఇసుకపాటి దెబోర కుమారికి ఏయూ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు వర్సిటీ వీసీ ఆచార్య జిపి.రాజశేఖర్ ద్వారా ఆమె బుధవారం పిహెచ్‌డి పట్టా పొందారు. 'ఇంగ్లీష్ యాజ్ ఏ మీడియం ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్ ఇన్ అప్పర్ ప్రైమరీ స్కూల్స్ ఇన్ ది డిస్ట్రిక్ట్ ఆఫ్ విశాఖపట్నం- ఎ స్టడీ' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను దెబోర కుమారి పిహెచ్‌డి పొందారు. ఏయూ ఐఎఎస్ఇ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజకుమారి పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా దెబోర కుమారిని విద్యా విభాగ ఆచార్యులు, పరిశోధకులు విద్యార్థులు అభినందించారు.

ఉచిత శిక్షణ, ఉపాధికల్పన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో 3 నెలలు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. 18-35ఏళ్లలోపు 10వ తరగతి లేదా ఆపైన విద్యార్హత కలిగిన పురుష అభ్యర్థులు 21లోగా దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు రామకృష్ణ (9948768778)ను సంప్రదించాలన్నారు.

పందుల స్వైర విహారం

బోయపాలెంలో ఐదెకరాల్లో అరటి తోటలు ధ్వంసం : లబోదిబోమంటున్న బాధిత రైతులు

పందుల దాడిలో ధ్వంసమైన అరటి తోట

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోనిగంభీరం పంచాయతీ బోయపాలెంలో పందులు స్వైరవిహారం చేశాయి. గ్రామంలోని ముప్పల నారాయణ, వానపల్లి మహేశ్వరరావు, వెంపాడ రెడ్డికి చెందిన చెరో ఎకరంతోపాటు గ్రామంలోని మరికొంతమంది రైతుల అరటితోటల్లోకి చొరబడి మొక్కలను నేలమట్టం చేయడంతోపాటు ధ్వంసం చేశాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట నష్టం వేలల్లో ఉంటుందని వాపోతున్నారు.

గంభీరం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వందలాది ఊర పందులు గుంపులుగా సంచరిస్తూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీధికాలువల్లో తిష్టవేసిన పందులు గుంపులను చూసి అటుగా వెళ్లాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉంది. అంతేకాక ఆయా గ్రామాల్లో అరటి, పూలతోటలు, కాయగూరల పంటను రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. పెంపకందారులు తమ పందులను విచ్చలవిడిగా గ్రామాలపైకి వదిలేయడంతో అవి పంటపొలాల్లోకి చొరబడి నాశనం చేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికే అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఏఒక్కరూ స్పందించడం లేదని బాధిత రైతులతోపాటు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల పందులు వలన మనుష్యులకు సైతం ప్రాణాపాయ ముప్పు ఉందని జివిఎంసి, పంచాయతీ అధికారులకు అనేకసార్లు విన్నవించామని, అయితే కనీస స్పందన లేదని అంటున్నారు. వీధుల్లో పిల్లలు రావాలంటే బయపడే పరిస్థితి ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, పందుల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ టెండర్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్ట్ హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్ రద్దు చేయాలని పోర్ట్ యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ. డిమాండ్ చేశారు. పిపిపి పద్ధతిలో పోర్టు గోల్డెన్ జుబ్లీ ఆసుపత్రిని ప్రయివేటుకు కట్టబెట్టాలన్న ప్రభుత్వం, యాజమాన్యం చర్యలకు నిరసనగా కార్మికులు చేపడుతున్న దీక్షలు బుధవారం 198వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఏటా వందల కోట్ల రూపాయలు లాభాలు సంపాదిస్తున్న విశాఖ పోర్టు ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయటం సమంజసం కాదన్నారు. గడచిన ఏడాదిలో విశాఖ పోర్టు రూ. 800 కోట్లు లాభాలు అర్జించిందని, జివిఎంసికి రూ.కోట్లలో పన్నులు చెల్లిస్తోందన్నారు. అలాంటి పోర్టు ఆధ్వర్యంలోని ఆసుపత్రి అభివృద్ధి చేయడానికి పిపిపి విధానంలో ప్రయివేటుకు ధారాదత్త చేయడం దుర్మార్గమన్నారు. పోర్టు నిధులతోనే ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని, వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీ, అవసరమైన మందులు, అధునాతన సౌకర్యాలను సమకూర్చడం ద్వారా పోర్టు ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విశాఖ.పోర్టు కు వేలకోట్ల విలువైన భూములతోపాటు రిజర్వ్ ఫండ్స్‌కూడా ఉన్నాయన్నారు పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ ఆలోచనను విరమించు కోవాలని, టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో గణేష్, కెపి.శంకర్, జిసిహెచ్ నాయుడు, వివిఎస్. మూర్తి,మంగరాజు, అమరేంద్ర, బి.జగన్ పాల్గొన్నారు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

భీమిలిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి -తగరపువలస : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చిట్టివలస ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అపార్ట్‌మెంట్‌లో మహిళలకు వంటగదిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపకశాఖ అధికారి జి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, వంటగదిలో గాలి, వెలుతురు ఉండాలని సూచించారు. పాడైపోయిన వంట గ్యాస్ ట్యూబ్ ను తొలగించి ఐఎస్ఐ మార్కు కలిగిన రబ్బరు ట్యూబ్ ను అమర్చాలన్నారు. వంట పూర్తయ్యాక వెంటనే సిలెండర్ వద్ద రెగ్యులేటర్ వాల్వ్‌ను ఆపేయాలన్నారు. గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే రెగ్యులేటర్ వాల్వ్ ఆపేయాలన్నారు. మండుతున్న స్టవ్‌లో కిరోసిన్ పోయొద్దని, వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ ఉంచవద్దని సూచించారు. వంట చేసేటప్పుడు నూలు వస్త్రాలు గానీ, ఏప్రాన్ గానీ ధరించాలని, ప్రమాదవశాత్తూ దుస్తులకు నిప్పంటుకుంటే పరిగెత్తకుండా, నేలపై దొర్లడం, దుప్పటి కప్పడం వంటివి చేయాలన్నారు. కాలిన గాయాలపై నీరు పోయాలన్నారు. వంటగ్యాస్ ప్రమాదాల నివారణపై కరపత్రాలు పంచడంతోపాటు, ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు

నర్సీపట్నం టౌన్: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం నర్సీపట్నంలోని షాపింగ్ కాంప్లెక్స్, సినిమా థియేటర్ల వద్ద అగ్నిమాపక అధికారి అప్పలస్వామి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ నెల 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : ప్రజలు అప్రమత్తతో ఉంటే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని స్థానిక అగ్నిమాపక అధికారి జి.వి.సత్యరాజు అన్నారు. అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా మండలంలోని సాయినగర్ కాలనీలో బుధవారం విద్యుత్ వలన జరుగు అగ్ని ప్రమాదాలు, వంట చేస్తుండగా జరుగు అగ్ని ప్రమాదాలు, ప్రమాదం జరకముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్మన్ పి.శివ ప్రసాద్, రథసారథి పి.అప్పారావు, ఫైర్మన్ కె.మహేశ్వరరావు, బి.ఉదయకుమార్, యం.సత్తిబాబు, యం.శివ పాల్గొన్నారు

పద్మనాభుని పునఃప్రతిష్ఠపై సమీక్ష

ప్రజాశక్తి -పద్మనాభం. మండలకేంద్రమైన పద్మనాభ గ్రామంలో కొండ శిఖరంపై అనంతపద్మనాభ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. బుధవారం కొండదిగువనున్న కుంతీ మాధవస్వామి ఆలయంలో ఇఒ నానాజీబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఆలయ నిర్మాణం, పునఃప్రతిష్ఠ పనులపై చర్చించారు. పద్మనాభుని ఆలయ ప్రతిష్ఠను వైభవోపేతంగా నిర్వహించేందుకు భక్తులనుంచి విరాళాల సేకరణపైకూడా సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు చర్చించారు.

నేరాలు ఘోరాలు

డ్రెయినేజీలో వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మెయిన్ రోడ్డు పాత ఎల్ఐసి కార్యాలయం వద్ద డ్రైనేజీలో అనకాపల్లికి చెందిన కుడిమి ఏసు (40) అనే వ్యక్తి మృతదేహాన్ని పారిశుధ్య కార్మికులు బుధవారం ఉదయం గుర్తించారు. మృతుడు ఏసు ప్లాస్టిక్ బాటిల్స్ సేకరించి అమ్ముకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. మంగళవారం రాత్రి మద్యం సేవించి నిద్రిస్తున్న సమయంలో డ్రైనేజీలో పడి ఉంటాడని భావిస్తున్నారు. దీనిపై చోడవరం పోలీసులు కేసు నమోదు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు.

ఇళ్ల నిర్మాణాలను పరిశీలన

పరిశీలిస్తున్న రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 27వ వార్డులో పలు నిర్మాణాలను బుధవారం జివిఎంసి, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పరిశీలించారు. గెడ్డలను ఆక్రమించుకుని, బఫర్‌జోన్ వదలకుండా నిర్మాణాలను చేపడుతున్నారని తహశీల్దార్ కార్యాలయానికి అందిన ఫిర్యాదుల మేరకు వార్డుపరిధిలోని ఆంటీమెస్ ప్రాంతంలో నిర్మాణాలను ఎంఆర్ఐ ప్రేమలత, టౌన్‌ప్లానింగ్ సెక్రటరీ కల్యాణి, విఆర్ఒ పరిశీలించారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని అందిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిశీలనకు వచ్చామని, నివేదికను ఉన్నతాధి కారులకు అందజేస్తామని వారు వెల్లడించారు.

నివాస గృహాలను క్రమబద్ధీకరించుకోండి

జిఒ30పై ఆటోలో విస్తృత ప్రచారం

ఆటోలో ప్రచారం చేస్తున్న యంత్రాంగం

ప్రజాశక్తి -ఆనందపురం : 2019 అక్టోబర్ 15కు ముందు నిర్మించుకుని నివాసముంటున్న ఇళ్లకు ఎటువంటి హక్కు పత్రాలు లేకుంటే క్రమబద్దీకరించుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్యాంప్రసాద్ సూచించారు .ఈ మేరకు గ్రామాల్లో ప్రజలకు అవగాహనకు జిఒ 30పై ఆటోలో మైక్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా తహశీల్దార్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, 2019 అక్టోబర్ 15కు ముందు నిర్మించి, నివాసముంటున్న ఇళ్లకు జిఒ 30 ద్వారా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఉచితంగా ఇస్తుందన్నారు. గ్రామాలలో ఎటువంటి ఫిర్యాదులు లేని, ప్రభుత్వ భూములలో ఉన్న ఇళ్లను క్రమబద్దీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 150 చదరపు గజాల విస్తీర్ణం ఉన్న ఇళ్లకు యజమాని పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఉచితంగా పట్టాలు మంజూరు చేస్తారన్నారు150 చదరపు గజాలకు పైబడి విస్తీర్ణంలో ఉన్న ఇళ్లకు ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం కనీస విలువను చెల్లించి క్రమబద్దీకరించుకోవచ్చన్నారు. సంబంధించిన వివరాలు గ్రామ సచివాలయములో గ్రామ రెవెన్యూ అధికారి, లేదా సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ వారి సంప్రదించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులతోపాటు ఇంటి పన్ను రశీదు, కరెంట్ బిల్లు, ఆధార్ కార్డు, ఇతరుల నుండి కొనుగోలు చేసే రాసుకున్న పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు అందజేయాలన్నారు. అదనపు సమాచారం కోసం తనను 91000 64937 నెంబరులో సంప్రదించాలని తహశీల్దార్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ సూచించారు.

సమస్యలపై ఎమ్మెల్సీకి వినతి

ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న అప్సా నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : ప్రయివేటు పాఠశాలల సమస్యలపై బుధవారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావుకు రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో కలిసి తమ సమస్యలను విన్నవించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

విద్యా హక్కు చట్టం ప్రకారం గడిచిన మూడేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 50వేలమందికి పైగా విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లోఉచిత అడ్మిషన్లు ఇచ్చామని, దానికి సంబంధించి ఫీజులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రయివేటు పాఠశాలల సమాచారాన్ని పొందుపరిచే వెబ్‌సైట్‌లో ఫారం-1లో కొన్ని అభ్యంతరకరమైన విషయాలున్నాయని, వాటిని తొలగించాలని కోరారు. అదేవిధంగా గతంలో మాదిరిగా ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రెన్యువల్ కాలపరిమితిని పదేళ్లకు పొడిగించాలని కోరారు. ఎమ్మెల్సీ చిరంజీవిరావును కలిసిన వారిలో అప్సా గౌరవాధ్యక్షుడు మెట్ట జనార్ధనరావు, ఫైనాన్స్ సెక్రటరీ పాలవలస భాస్కరరావు, ఉత్తరాంధ్ర అధ్యక్షులు గణపతిరావు, కౌన్సిల్ సభ్యులు రామ్మోహనరావు, జిల్లా అధ్యక్షులు కె రామకృష్ణ, కోశాధికారి ఎం.శ్రీను, ఉపాధ్యక్షుడు డివి శ్రీనివాస్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జ్యోతికమల

ప్రజాశక్తి-మధురవాడ : పిఎం.పాలెం వనిత వాకర్స్ ఆధ్వర్యంలో బేతని సమీపంలో చలివేంద్రాన్ని క్లబ్ అధ్యక్షురాలు జ్యోతికమల బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ద్వారకనాథ్, క్యాబినెట్ సెక్రటరీ డిజిఇ మహేశ్వరరావు, సెక్రటరీ జనరల్ ఐజాక్, అడిషనల్ సెక్రటరీ జనరల్ సత్యనాదం, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు. వాకర్స్ క్లబ్ సెక్రటరీ జనరల్ ఐజక్ మాట్లాడుతూ,బాటసారులు, వాహనదారులు దాహార్తి తీర్చేందుకు వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వనితావాకర్స్ క్లబ్ సభ్యుల చొరవను ద్వారకానాథ్ ప్రశంసించారు కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పలువురు న్యాయమూర్తుల బదిలీలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్: రాష్ట్రవ్యాప్త సీనియర్ డివిజన్ న్యాయమూర్తుల బదిలీలలో భాగంగా విశాఖపట్నంలోని పలువురు న్యాయమూర్తులకు స్థానచలనం కలిగింది. విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీగా పనిచేస్తున్న ఎంవి.శేషమ్మను గాజువాక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ప్రస్తుతం సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న ఆర్‌సన్యాసినాయుడును నియమించారు. గాజువాకలో ఇదే స్థానంలో పనిచేస్తున్న వై శ్రీలక్ష్మిని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా గాజువాక బదిలీ అయ్యారు. ఇదే స్థానంలో విధులు నిర్వహిస్తున్న ఎ.కృష్ణప్రసాద్‌ను విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు బదిలీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 28 మంది సీనియర్ డివిజన్ న్యాయమూర్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు జనరల్ రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. బదిలీ అయిన న్యాయమూర్తులు ఈనెల 30లోగా కొత్తస్థానాల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గిట్టుబాటు ధర, కొనుగోళ్లు లేక రబీ రైతుల దిగాలు!

మొక్కజొన్న పంటను చక్కబెడుతున్న రైతు

- దోచుకుంటున్న దళారులు, వ్యాపారులు
- తూకంలోనూ తేడా.. ధరలోనూ వ్యత్యాసం
- పొలాల్లోనే ధాన్యం, మొక్కజొన్న, చోడి పంటలు
- ముందే విన్నవించినా పట్టని అధికారులు

కళ్లాల్లో ఆరుబయటే ఉన్న బస్తాలు

ప్రజాశక్తి - పద్మనాభం : ప్రకృతి ప్రతికూల పరిస్థితులు, సవాలక్ష ఇబ్బందులను ఎదుర్కొని, ఆరుగాలం శ్రమించి, పండించిన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకోలేక రైతన్నలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం రబీసీజన్‌లో మండలంలోని పలు గ్రామాల్లో రెండో పంటగా వరితోపాటు మొక్కజొన్న, రాగులు సాగుచేశారు. మూడుపంటలు ఒకేసారి కోతకు రావడంతో అష్టకష్టాలు పడి పంట దిగుబడులను కూడబెట్టినా, ఇపుడు వాటిని నిల్వ ఉంచేచోటులేక, అమ్ముకునేందుకు గిట్టుబాటు ధర రాక, కొనే దిక్కులేక అల్లాడిపోతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు, దళారుల బారిన పడి తమ కష్టాన్ని అప్పనంగా అప్పగించకోక తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు.

పద్మనాభం మండలంలో 22 గ్రామపంచాయతీల పరిధిలోని 54 గ్రామాల్లో మెజార్టీ రైతులు వ్యవసాయాధారంగా జీవనం సాగిస్తున్నారు. 9 శాతం మంది పాడిని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో మొక్కజొన్న, చోడి, వరి పంటలు విస్తారంగా సాగుచేశారు. ఖరీఫ్ అనంతరం వెంటనే చెరువుల్లో సాగునీరు ఉండడం, ఆపై వర్షాలు కురవడంతో పలు గ్రామాల్లోదాదాపు 600 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. రబీ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్‌లో వివరాలను నమోదు చేసుకున్న రైతులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అప్పట్లోనే మొర పెట్టుకున్నారు. ప్రస్తుతం పంట చేతికొచ్చిన తర్వాత ధాన్యం కొనే దిక్కులేక, నిల్వ ఉంచే చోటులేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

మొక్కజొన్న, చోడి రైతులదీ ఇదే పరిస్థితి

ఇదిలా ఉంటే ప్రస్తుత రబీ సీజన్‌లో వరికి రెట్టింపు విస్తీర్ణంలో దాదాపు 1100 ఎకరాలకు పైబడి మొక్కజొన్న సాగుచేశారు. ఖరీఫ్ అనంతరం నవంబర్‌లో అనేక ఎకరాల్లో మొక్కజొన్న పంటవేయగా, అప్పట్లో కురిసిన వర్షాలకు పంటమొత్తం పాడైంది. ఎకరాకు దాదాపు రూ.20వేల వరకు పెట్టుబడులు వర్షార్పణమయ్యాయని ఆవేదన చెందిన రైతులు, తర్వాత ఆయా పొలాల్లో స్వల్పకాలిక వరివంగడాలను ఎద రూపంలో దమ్ము పట్టి సాగుచేశారు. తర్వాత పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడులు బాగా వచ్చాయని రైతులు ఆనందం వ్యక్తంచేసినా, పండించిన పంటను అమ్ముకుని సక్రమంగా సొమ్ము చేసుకోలేక తల్లడిల్లిపోతున్నారు. రబీలో వరి, మొక్కజొన్న, రాగులు పంటదిగుబడులను పొలాల నుంచి కళ్లాల్లోకి చేర్చిన రైతులు, ఇపుడు వాటిని ఎక్కడ నిల్వ చేయాలో పాలుపోక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో మిల్లర్లు, వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదని అంటున్నారు ఇదే సమయంలో కొంతమంది వ్యాపారులు సిండికేట్లుగా మారడంతోపాటు దళారుల జోక్యంతో రైతు కష్టాన్ని దోచుకోవాలని చూస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. మొక్కజొన్న క్వింటా ధర మార్కెట్‌లో రూ.2400 పలుకుతుంటే, రైతులు దగ్గర 105కిలోలను తూకం వేసి, కేవలం రూ.2,100 మాత్రమే చెల్లిస్తున్నారని అంటున్నారు. ధాన్యం ధర కూడా బాగా తగ్గించేస్తున్నారని అన్నదాతలు అంటున్నారు. వంద కిలోల ధాన్యాన్ని రూ.2,100కు కొనుగోలు చేయాల్సి ఉండగా, తడి, తరుగు అంటూ ఏవేవో కారణాలు చెప్పి బస్తాకు పది కిలోలు తగ్గించడంతోపాటు క్వింటా ధాన్యం రూ.1800 నుంచి రూ.1900కు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. ఇక చోడిపంట కూడా దళారుల భోజ్యమైపోతోందని రైతులు వాపోతున్నారు. క్వింటా రాగులు రూ.నాలుగు వేలపైచిలుకు ధర ఉంటే రూ.3,100కు మంచి వ్యాపారులు, దళారులు కొనడం లేదని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి, రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్న, చోడి ఇతర పంటలకు గిట్టుబాటు ధరనిచ్చి కొనుగోలు చేయాలని విలాస్‌ఖాన్‌పాలెంకి చెందిన రైతులు బోయి రామారావు, జరజాపు గణపతి, బుగత శ్రీను తదితరులు వేడుకుంటున్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న బివికె చైర్మన్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులను బుధవారం ద్వారకానగర్ బివికె కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించి, సత్కరించింది. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో బివికె కాలేజీకి చెందిన ఇంటర్ సెకెండియర్ ఎంపిసి విభాగంలో సజ్జాన్నిసా (951), బైపిసిలో హర్షిత దీప్తి (945), సిఇసిలో ఊర్వశి శర్మ (938), ఎంఇసిలో ఆశిష్ చంద్ర (888) మంచి మార్కులు సాధించి కాలేజీ టాపర్స్‌గా నిలిచారు. అలాగే ఫస్టియర్ ఎంపిసిలో ఎంలావణ్య 458 మార్కులు, బైపిసిలో దాస్ సునీల్ 416, సిఇసిలో ఎం.అభిషేక్ 434, హెచ్ఇసిలో ఎం. ధృతి శ్రీపాద 473, ఎంఇసిలో ఎం సుశీల 463 మార్కులు సాధించారు

ప్రతిభ చూపిన విద్యార్థులను బివికె విద్యాసంస్థల చైర్మన్, ఎయు మాజీ వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య జి నాగేశ్వరరావు, కార్యదర్శి వి రామసత్యనారాయణ, బోర్డు డైరెక్టర్లు, కరస్పాండెంట్ ఆచార్య కందర్ప విశ్వనాథం, ప్రిన్సిపల్ పి రత్నశేఖర్ అధ్యాపక సిబ్బంది అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి రత్నశేఖర్ మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా తమ కాలేజీ అధ్యాపక సిబ్బంది చేస్తున్న కృషికి, విద్యార్థులు సహకరించడంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు.

పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యసాధన

స్నాతకోత్సవంలో విద్యార్థులతో 'ప్రియదర్శిని' చైర్మన్ రామారావు

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి పట్టుదలతో కృషిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రియదర్శిని అకాడమీ చైర్మన్ డాక్టర్ బి రామారావు అన్నారు. బుధవారం రామచంద్రనగర్‌లోని ప్రియదర్శిని హైస్కూల్‌లో ఎల్‌కెజి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభకు పదునుపెట్టి, వారిని చదువుతోపాటు ఇతర విషయాల్లో ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి తమ పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ మార్కండేయులు అధ్యక్షతన నిర్వహించిన స్నాతకోత్సవం లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సెయింట్ ఆన్స్'లో విజయోత్సవం

ప్రజాశక్తి-ములగాడ : ఇంటర్‌లో మంచి ఫలితాలను సాధించడంపై బుధవారం మల్కాపురం సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో విజయోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథి: సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ- ఇంటర్ సెకెండియర్ ఫలితాల్లో సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులు సాధారణ కోర్సుల్లో- 81శాతం, వృత్తి వత్తి విద్యా కోర్సుల్లో 88శాతం, ఫస్టియర్ సాధారణ కోర్సుల్లో 73శాతం, వృత్తివిద్య కోర్సులలో 93శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థినులు ప్రియాంక పాండే, ప్రజ్ఞ ప్రీతి మహంతి చెరో 976 మార్కులు సాధించి కళాశాల టాపర్స్‌గా నిలిచారని కొనియాడారు. ఫస్టియర్‌లో నాగజ్యోతి 450, శ్రేయ 432చ చంద్రకళ 493 కె. నవ్య 492 మార్కులను సాధించారన్నారు.కాలేజీలో 38 మంది విద్యార్థినులు 90శాతానికి పైగా మార్కులను సాధించి రికార్డు నెలకొల్పారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కాస్లిన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధులు సిస్టర్ గెసిల్లా, సిస్టర్ జానీస్, సిస్టర్ సంధ్య, సిస్టర్ సుగంధ మాట్లాడారు.ఇంటర్ తర్వాత ఏ కోర్సులో చదివితే భవిష్యత్ బాగుంటుందో అవగాహన కల్పించారు. సీనియర్ అధ్యాపకులు ఇపిఎస్.భాగ్యలక్ష్మి, ఎ.ఆదిలక్ష్మి, వై. ప్రేమలత అధ్యాపకురాలు సుధ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రేమకుమారి

జట్లమ్మ తల్లి సిరిమానుకు పూజ

ప్రజాశక్తి -పద్మనాభం:. మండలంలోని పాండ్రంగి గ్రామదేవత జట్లమ్మ తల్లి సిరిమానోత్సవ పండుగను వచ్చేనెల 12,13,14 తేదీల్లో నిర్వహించనున్నారు. బుధవారం పండుగకు సంబంధించి సిరిమాను కొట్టే వేడుకను గ్రామపెద్దలు, ప్రజల మధ్య నిర్వహించారు. గంధవరం గ్రామంలోని రౌతువారి కళ్లాల్లోని చింతచెట్టును సిరిమాను కోసం పూజలు నిర్వహించి కొట్టే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్లు, చిడతలు వంటి ప్రదర్శనలతోపాటు పాండ్రంగి నుంచి గంధవరం వరకు సుమారు పది కిలోమీటర్లు 200 మంది గ్రామస్తులు, పది ఎడ్ల బళ్లలో తరలివెళ్లి సిరిమాను చెట్టును తీసుకొచ్చారు.కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణ వ్యతిరేక సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని, ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 19న విశాఖపట్నం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరుగు రాష్ట్రస్థాయి సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా సిఐటియు అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత హాజరుకానున్నారని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం రైల్వేలను ప్రైవేటీకరణ చేస్తుందని, రైళ్ల రూట్లు, స్టేషన్లు పిపిపి పేరుతో ప్రైవేటు వారికి అప్పగిస్తుందని పేర్కొన్నారు. లక్షలాది రైల్వే ఖాళీలు భర్తీ చేయకపోవడం వలన సిబ్బంది లేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రైల్వే లోకో పైలట్లు విరామం లేకుండా పని చేస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, ఖాళీలు భర్తీ చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. రోజు లక్షలాదిమంది ప్రయాణికులను అతి తక్కువ ఖర్చుతో గమ్యానికి చేరుస్తున్న రైల్వేలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాసరావు, కార్యదర్శి వి.సత్యవతి, జిల్లా కమిటీ సభ్యులు కె.శాంతి, బి.రామలక్ష్మి పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు శంకరరావు తదితరులు

బుచ్చయ్యపేట మండలంలో రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న వర్షపునీరు

ఈదురుగాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేటలో బుధవారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చేసుకొని ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. అనంతరం భారీగా వర్షం కురిసింది. మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, కండిపూడి రాజాం తదితర గ్రామాల్లో రోడ్లపై భారీగా నీరు ప్రవహించింది. కొంకోట -బంగారుమెట్ట రోడ్లో బుచ్చయ్యపేట వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కశింకోట : కశింకోట మండలంలో బుధవారం ఉదయం ఎండ కాయగా, సాయంత్రం 5 గంటలకు చిరు జల్లులు పడ్డాయి. ఎండతో అల్లాడిన ప్రజలు ఈ వర్షానికి ఉపసమనం పొందారు.

వేట నిషేధ భృతి రూ.40వేలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి

మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందించే సహాయాన్ని రెండేళ్లకు కలిపి రూ.40వేలు ప్రతి లబ్ధిదారునికి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మత్స్యకారుల జీవన పరిస్థితి చాలా దయనీయంగా ఉందని, ఉపాధి లేక వలసలు పోతున్నారని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ఫార్మా కంపెనీల వ్యర్థాలకు చేపలు చని పోతుండడంతో వేటకు వెళ్ళినా కనీస కూలీ గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి నిషేధ రోజుల్లోనే పరిహారం చెల్లించాల్సి వుండగా గత సంవత్సరానిది నేటికీ చెల్లించలేదని, మళ్ళీ వేట నిషేధ కాలం ప్రారంభమైందని పేర్కొన్నారు. ఇప్పుడు గత సంవత్సరం నిషేధ భృతిని ఏప్రిల్ 26న లబ్ధిదారులకు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. కుటుంబ పోషణ కోసం ఇంట్లో వున్న బంగారు వస్తువులను తాకట్టుపెట్టుకొని కుటుంబ అవసరాలు తీర్చుకోవల్సిన దుస్థితి ఏర్పడిందని, తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మత్స్యకారులకు జీవన భృతిని వెంటనే రెండు సంవత్సరాలు కలిపి రూ.40వేలు విడుదల చేయాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

దళితపేటలో దుర్గంధం

చెరువులో నీరు నిల్వతో కంపుకొడుతున్న వైనం

పచ్చని నాచు పట్టి దుర్గంధ పూరింతంగా ఉన్న చెరువు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని దళిత పేట వద్ద దుర్గంధం వెదజల్లుతోంది. ఈ దళితపేట వద్ద గుల్లిపల్లి వారి చెరువు ఉంది. ఈ చెరువుకు ఒకప్పుడు ఆయకట్టు భూమి ఉండేది. ఇప్పుడు చెరువు చుట్టూ ఇళ్లు, ఇతర నిర్మాణాలు జరగడంతో చెరువు నిరుపయోగంగా ఉంది. పెదరాయి సెంటర్ నుండి గోళ్ళపేట, దళిత పేట తదితర ప్రాంతాల నీరు మొత్తం ఈ చెరువులోకే చేరుతుంది. చెరువులో నీరు కిందకు విడిచిపెట్టేందుకు ఉన్న మధుం పనిచేయక పోవడంతో కిందికి నీళ్ళు వెళ్ళడం లేదు. దీని వల్ల నీరు నిల్వ ఉండి పోతుంది. దీనికి తోడు చనిపోయిన కుక్కలు, పందులు, పిల్లులు, ఎలుకలుచ, చెత్త చెదారం ఈ చెరువులోనే పడేస్తున్నారు. దీంతో అవి కుళ్లిపోయి, నీరు రంగు మారి కంపుకడుతోంది. ఈ చెరువు దగ్గర పాఠశాల ఉంది. ఈ చెరువు నుండి వచ్చే దుర్గంధం వల్ల పాఠశాల విద్యార్థులు, చుట్టూ నివాసముంటున్న దళితులు, పేదలు ఆనారోగ్యం పాలవుతున్నారు. దోమలు బెడద ఎక్కువ కావడంతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాకాలం వస్తే చెరువు నిండిపోయి దళితపేటలోని ఇళ్లకి మురుగునీరు వచ్చేస్తుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ చెరువులో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దళితులు అనారోగ్యం పాలవుతున్నారు : వెంకన్న

దళితపేట వద్ద చెరువు వల్ల దుర్గంధం వెదజల్లి పేదలు దళితులు ఆనారోగ్యం పాలవుతున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులు క్రితమే అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారని, కాని దళితులు నివాసముంటున్న ప్రాంతంలో సమస్యలను పరిష్కరించకుండా వివక్ష చూపడం దారుణమన్నారు. వెంటనే అధికారులు స్పందించి శాశ్వతంగా చెరువు నీళ్ళు పోవడానికి మార్గం ఏర్పాటు చేయాలని, లేదంటే చెరువును పూర్తిగా మూసివేయాలని వెంకన్న కోరారు.

హుండీ సొమ్ము లెక్కిస్తున్న దృశ్యం

నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-అనకాపల్లి, అనకాపల్లి రూరల్ : అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారి హుండీని దేవస్థానం ఉత్సవ మండపంలో బుధవారం లెక్కించారు. హుండీ ద్వారా మార్చి 15 నుండి నుండి ఏప్రిల్ 16 వరకు మొత్తం 32 రోజులలో భక్తులు సమర్పించిన ముడుపులు, మొక్కుబడులు నగదుగా రూ41,51,973, బంగారం 15 గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 700 గ్రాములు వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శీను (గొల్ల బాబు) ఆలయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి, దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ వసంత కుమార్, టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, దేవస్థానం సిబ్బంది, పూజారులు, యూనియన్ బ్యాంకు గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది, అనకాపల్లి టౌన్ పోలీసు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోండి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్లు రెండో విడతలో భాగంగా ఏప్రిల్ ఒకటి నుంచి జూలై 31లోగా సంబంధిత గ్యాస్ ఏజెన్సీల్లో బుక్ చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో వారి వారి ఖాతాల్లో ప్రభుత్వం డబ్బు జమ చేయడం జరుగుతుందన్నారు. 15 కిలోమీటర్ల పరిధిలో ఉచిత గ్యాస్ డెలివరీ ఉంటుందని, 15 కిలోమీటర్లు పరిధి దాటితే గ్యాస్ సిలిండర్ పై రూ.30 వసూలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అదనంగా ఎటువంటి చార్జీలు చెల్లించనవసరం లేదని, వసూలు చేస్తే పౌర సరఫరాల విభాగం టోల్ ఫ్రీ నెంబర్ 1967 లేదా ఆయిల్ కంపెనీ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 18002333555 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గోపీకృష్ణ శివం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సెమ్స్ సంయుక్తంగా నైపుణ్య కళాశాలలో దీన దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం కింద 18 నుంచి 27 సంవత్సరాల వయసు గల బిఈ, బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఐటిఐ ఫిట్టర్, టర్నర్ వెల్డర్, మెషనిస్ట్ డిప్లమో మెకానికల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. వీరికి ఇండస్ట్రియల్ ఆటోమేషన్ స్పెషలిస్ట్, ఆటోమోటివ్ వెల్డింగ్ మిషన్ టెక్నీషియన్, సిఎన్సి టర్నింగ్ కోర్సుల్లో మూడు నుంచి ఐదు నెలలపాటు ఉచిత శిక్షణ, వసతి కల్పించడంతోపాటు ఉపాధి సహకారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు కోసం విశాఖపట్నం సింధియా జంక్షన్లో గల సెమ్స్ కేంద్రంలో గాని, 8688411100 ఫోన్ నెంబర్‌కు సంప్రదించి ఈనెల 21వ తేదీ లోగా తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

మెరిట్ విద్యార్థినికి లాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి-కశింకోట

ఇంటర్ బైపిసిలో 983 మార్కులు సాధించిన కసింకోట మండలం తేగాడ కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని కె.రాజులమ్మకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా లాప్ టాప్‌ను అందజేశారు. రాజులమ్మ రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఉత్తమ విద్యార్థిగా నిలవడంతో ఈ మేరకు మంత్రి లోకేష్ లాప్ టాప్‌ను అందజేసినటులు ప్రిన్సిపల్ చంద్రకళ బుధవారం తెలిపారు. రాజులమ్మను జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డ అప్పారావు నాయుడు, ఎంఈఓ సురేష్ కుమార్, స్థానిక ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు

రాజులమ్మకు లాప్‌టాప్ అందిస్తున్న మంత్రి లోకేష్

తాడిని సురక్షిత ప్రాంతానికి తరలించాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలో ఫార్మాసిటీ కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తాడి గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాన్ని వెంటనే సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని, రీ సర్వే నిర్వహించి మేజర్ కుమార్తెలు, కుమారులను లెక్కించాలని, భవనాల అంచనా వేయాలని, 2013 భూ సేకరణ చట్ట ప్రకారంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలుష్యం వల్ల అనేక జబ్బులతో గ్రామస్తులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద తాడి, చిన్న తాడి, కాలనీలను వెంటనే తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఖండేపల్లి అప్పలరాజు, పితాని సన్యాసిరావు, కండేపల్లి పెంటయ్య, కనకారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు, స్థానికులు

గృహ వ్యర్థాలు వేయడంపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లిరూరల్ : అనకాపల్లి పరిసర ప్రాంతాల నుండి గృహ నిర్మాణ వ్యర్థాలను తీసుకొచ్చి రింగ్ రోడ్డు బెల్లం మార్కెట్ వద్ద వేయడంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యాన బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కొణతాల హరనాథ్ బాబు మాట్లాడుతూ రాత్రి సమయాల్లో రోడ్డు పక్కన వేసేసి వెళ్లిపోతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పురాతన భవనాలను తొలగించిన వ్యర్థాలను ఎక్కడో దూరంగా వేస్తామని చెప్పి కాంట్రాక్టు ఒప్పుకొని రాత్రి సమయాల్లో రింగ్ రోడ్‌లో వేసి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. జీవిఎంసీ అధికారులు అక్కడ సీసీ కెమెరా, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు పాల్గొన్నారు.

రూ.63 లక్షల విలువైన చోరీ సొత్తు రికవరీ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో పలు చోరీల కేసులకు సంబంధించి రూ.63 లక్షల విలువైన చోరీ సొత్తును రికవరీ చేసినట్లు ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16న కోటవురట్ల మండలం, రాజుపేట జంక్షన్ వద్ద వరుసగా ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసి మొత్తం 23 కేసులలో దొంగతనం చేసిన 63 తులాల బంగారం, 6.5 తులాల వెండి, రూ.15వేలు నగదు మొత్తము సుమారు రూ.63 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశామని, ఒకరిని జువెనైల్ హోమ్‌కు తరలించామని చెప్పారు. నిందితులు తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ, రాత్రి వేళ దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు వినియోగించి నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడంలో పోలీసు శాఖ విజయవంతమైందని పేర్కొన్నారు. నిందితుల్లో కోటవురట్ల మండలం రాజుపేట గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు పోలమరశెట్టి దుర్గాప్రసాద్‌తో పాటు బీశెట్టి లోకేష్, యల్లపు భూపతి, మడుతరి సూర్య, దొడ్డి ఆదిబాబు, ఒక జువనైల్ ఉన్నారని తెలిపారు. దుర్గాప్రసాద్ తండ్రి మృతి చెందడంతో చిన్ననాటి నుంచి జులాయిగా తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసై ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి చర్యలతో తన స్నేహితులతో కలసి ఈ చోరీలకు పాల్పడ్డారని చెప్పారు. దొంగలించిన బంగారాన్ని మునగపాక మండలం, జంగాల వీధికి చెందిన తన బావ దొడ్డి ఆదిబాబుకు అప్పగించినట్టు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. దొడ్డి ఆదిబాబుపై ఇప్పటికే 9 మోటార్ సైకిల్ దొంగతనాల కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. కోటవురట్ల పోలీసు స్టేషన్ పరిధిలో 6 కేసులు, నర్సీపట్నం రూరల్ -3, మాకవరపాలెం- 3, కశింకోట-3, రోలుగుంట -2, బుచ్చెయ్యపేట-2, యలమంచిలి రూరల్-2, యలమంచిలి టౌన్-1, నాతవరం-1 మొత్తం 23 దొంగతనం కేసులు వీరిపై నమోదు చేసినట్టు వెల్లడించారు. అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎల్.మోహనరావు పర్యవేక్షణలో సెంట్రల్ క్రైం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో క్లూస్ టీం, ఐటీ కోర్,

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో కేసులు ఛేదించినట్లు చెప్పారు. ఈ కేసు దర్యాప్తులో విశేష ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో నర్సీపట్నం డిఎస్పీ పి.శ్రీనివాసరావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ కె.అప్పలనాయుడు, నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.రామకృష్ణ, కోటవురట్ల ఎస్సై ఎస్.రమేష్, సిసిఎస్ ఎస్సై పి.రమేష్, ఇతర అధికారులు, సిసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-కశింకోట : ఎన్నికలకు ముందు టిడిపి కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. సిపిఐ కశింకోట 4వ మండల మహాసభ బుధవారం జరిగిందిజ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి, వచ్చాక ఆ హామీలను నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడానికి మోడీ ప్రయత్నిస్తుంటే చంద్రబాబు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. అనంతరం సిపిఐ మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండల కార్యదర్శిగా మునగపాక సత్తిబాబు, సహాయ కార్యదర్శిగా ఒమ్మి సూరిబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, రామునాయుడు, నాయకులు సత్తిబాబు, చీపురుపల్లి ముత్యాలు, సూరిబాబు, శ్రీను, సురేంద్ర, సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం రాజాం గ్రామంలో పిచ్చికుక్క బుధవారం స్వైర విహారం చేసింది. గ్రామానికి చెందిన మరిసా అప్పలకొండ ఊరఫ్ సోడమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో ఉండగా పిచ్చికుక్క దాడి చేసి రెండు చేతులపై కరడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో గ్రామానికి చెందిన పలువురు పిచ్చి కుక్కని కొట్టి చంపారు. వృద్ధురాలు చికిత్స కోసం తురకలపూడి హాస్పిటల్‌కి తరలించాగా, అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కశింకోట : పోషకాహారం ద్వారా ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని ఐసిడిఎస్ సిడిపిఓ ప్రభావతి అన్నారు. మండలంలోని విస్సన్నపేట గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెయ్యి రోజులు తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలంటే పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ముందుగా అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పునూరు మాణిక్యం అప్పారావు, టిడిపి కూటమి నాయకులు సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, సూపర్వైజర్ సిహెచ్ వంశీప్రియా, మహిళా పోలీస్ సంతోష్, అంగన్వాడి కార్యకర్తలు రమణమ్మ, రజనీ, గంగ వేణి, పరమేశ్వరి, పార్వతీ ఆశా, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని అరబ్బుపాలెం, నారాయణపాలెం గ్రామాలకు చెందిన 60 మంది జనసేన పార్టీలో బుధవారం చేరారు. వారికి స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం. నాయకులు కాల చంద్రమోహన్, ఎల్లపు సంతోష్. ప్రభాస్ శీను, దాసరి గోపాలకృష్ణ, ముల్లి సంతోష్, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో జనసేనలో చేరిన దృశ్యం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రకృతి వ్యవసాయంపై పంట వేసి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం ఎల్‌బిపి.అగ్రహారం, బంగారుమెట్ట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. తొమ్మిది రకాల జాతులు 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్పి కిట్స్ తయారు చేసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లచ్చన్న మాట్లాడుతూ వీటిని తొలకరి వర్షాలకు ముందుగా ఎకరాకు 12 కేజీలు చొప్పున, వరినాట్లు వేయడానికి 45 రోజులు ముందు భూమిలో వేసుకోవాలని సూచించారు. వివిధ పంటల వేర్లు భూములో ఆశ్రమం కల్పించి పంటలకు ఉపయోగపడే సంతతుని అభివృద్ధి పరుస్తాయని చెప్పారు. తద్వారా ప్రధాన పంటకు కావలసిన సూక్ష్మ, స్థూల పోషకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. జీవ వైవిధ్యం పెరిగి నేలలో సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందన్నారు. ప్రధాన పంటలో రసాయనక ఎరువులు వినియోగం తగ్గి, కలుపు తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐఒ భాస్కరరావు, మాజీ సర్పంచ్ తమరణ దాసు, అగ్రహారం సర్పంచ్ శ్రీనివాసరావు, కొండపాలెం సర్పంచ్ ఎం.వెంకట సోమినాయుడు, బంగారుమెట్ట సర్పంచ్ బాబురావు, ఎంపిటిసి యల్లపు జగ్గారావు, ఎం.మోహనరావు, రైతులు నాగమణి, చిన్ననాయుడు బాబు, శ్రీనివాసరావు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం

పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సిఎం బూడి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి గ్రామం గొల్లపేటలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం 8 గంటల నుండి రత్నన్యాసము, గర్తన్యాసము, జన్యాసము, పూర్ణాహుతి, ధాతన్యాసం, యంత్రప్రతిష్ట శిఖర, విగ్రహ ప్రతిష్టలు, దృష్ట కుంభ, దేనదర్పణ దర్శనం, సర్వ దర్శనం, ఆశీర్వచనం నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. కోలాటం, భజనలు, తప్పిటగుళ్ళు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో గరిసింగి, వెంకట్రాజపురం, రైవాడ సర్పంచులు గూడెపు రాము, దాసరి సంతోష్ కుమార్, చల్లా నాయుడు, తెనుగుపూడి గ్రామ ఉపసర్పంచ్ కాటిపాం పెదనాయుడు, వేణుగోపాలస్వామి యువజన సంఘం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

పోలీసులకు కూలింగ్ గాగుల్స్, టోపీలు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : వాసవి క్లబ్, కెమిస్ట్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సహకారంతో అనకాపల్లి ట్రాఫిక్ పోలీసులకు టోపీలను, సాయిరాజా వెల్ఫేర్ ట్రస్ట్, రాజా ఆప్టికల్స్ అండ్ కంటి ఆసుపత్రి సహకారంతో కూలింగ్ కళ్లజోళ్లను అందజేశారు. ట్రాఫిక్ సిఐ ఎం వెంకటనారాయణ చేతులమీదుగా వీటిని పోలీసులకు అందించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులకు ఉచితంగా కూలింగ్ కళ్ళజోళ్ళను అందించడం అభినందనీయమన్నారు. సాయిరాజా వెల్ఫేర్ ట్రస్ట్ రాజా ఆప్టికల్స్ అండ్ కంటి ఆసుపత్రి అధినేత పూసర్ల రాజా మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ కుటుంబాన్ని, ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఎండలో సైతం ప్రజా సేవకే అంకితమైన పోలీసులకు ఈ విధంగా కళ్ళజోళ్ళు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉచిత కంటి ఆపరేషన్లు అవసరమైన వారు 903222 3330 నెంబర్‌కు సంప్రదించాలని పూసర్ల రాజా కోరారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్, అలయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు, కెమిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శివ, ట్రాఫిక్ సిఐ శేఖర్ హెడ్ కానిస్టేబుల్ రెడ్డి శీను సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ వెంకట నారాయణ

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ట్రాఫిక్ రూల్స్‌పై స్థానిక ఎఎంఎఎల్ కాలేజ్‌లో విద్యార్థులకు బుధవారం అవగాహన కలిగించారు. వాహనం నడిపేటప్పుడు తప్పక ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ సూచించారు. డ్రగ్స్ వాడితే కలిగే నష్టాలను వివరించారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం తాళ్లపాలెం సెక్షన్ పరిధిలోని నరసింగపల్లి సబ్ స్టేషన్ 11కెవి తాళ్లపాలెం ఫీడర్ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కశింకోట ఈఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు, నరసింగపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని నరసింగపల్లి, జె తుని, ఎన్‌జి పాలెం, త్రిపురువానిపాలెం, అచ్యుతాపురం చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినిపాలెం, పరవాడపాలెం, జమ్మదలపాలెం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, యేనుగుతుని, చిన్న యెనుగుతుని, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మొసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. తాళ్లపాలెం ఫీడర్ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ వినియోగదారులకు ఉదయం 4గంటల నుండి 8గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరిచాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బాట జంగాలపాలెం, నారపాడు పంచాయతీలలో బుధవారం ఎంపీడీవో పి.పద్మజ పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రెండు గ్రామాల్లోనూ ఉపాధి హామీ పనులను, గోకులం షెడ్లలను పరిశీలించారు. మనమిత్ర సర్వేను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆయా సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట పంచాయతీ కార్యాలయం ఎదురుగా కళ్యాణ మండపంలో బుధవారం శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షులు బుదిరెడ్డి చిన్నా ఈ శిబిరాన్ని ప్రారంభం చేశారు. కంటి వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని..

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన

రోలుగుంటలో వినతిపత్రాన్ని ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్:సమస్యలను పరిష్కరించాలని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపిడివో సత్యన్నారాయణకు వినతిపత్రం అందించారు. బుధవారం ఎస్.రాయవరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ, గడచిన 19 సంవత్సరాలుగా గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న తమను గ్రామపంచాయితీ సిబ్బందిగా క్రమబద్దీకరించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎఫ్‌టి ఈ ఇచ్చి పూర్తిస్థాయి హెచ్‌ఆర్ ఫాలసీ, హెల్త్ కార్డు, ప్రమాద భీమా, గ్రాట్యుటీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వడంతో పాటు, పది లక్షల రూపాయలు నష్టపరిహారం అందించాలన్నారు. గతంలో ఎన్ ఆర్ ఈ జి ఎస్ లో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉద్యోగులకు జీతాలు పెరిగాయని, ఫీల్డ్ అసిస్టెంట్లకు మాత్రం పెరగలేదన్నారు. విద్యార్హతల ఆధారంగా కంప్యూటర్ ఆపరేటర్లుగా, టెక్నికల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని సూచించారు. ఈ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపిడివో సత్యన్నారాయణకు అందచేసి ప్రభుత్వానికి తెలియచేయాలంటూ అభ్యర్ధించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోలుగుంట:తమ సమస్యలు నెరవేర్చాలని కోరుతూ మండలంలోని జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపిడిఒ నాగేశ్వరరావు, ఏపిఓ ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. గత 18 ఏళ్ళుగా ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న పేస్కేల్ పెంచడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించలేదాన్నరు. గ్రామాల్లో పని చేసే క్రమంలో రాజకీయ నాయకులు వేధిస్తున్నారని, వేధింపులు ఆపాలని, మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎక్స్‌గ్రేషియా కల్పించాలని, మండలంలో పంచాయతీలకు బదిలీల అవకాశం కల్పించాలని కోరారు.

బుచ్చయ్యపేట :గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలుకు గ్రామస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరుతూ మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు లేకుండా, 2016 నుండి వేతనాలు పెంచకుండా ప్రభుత్వాలు ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ మరణిస్తే ఆ కుటుంబాలకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు జి.వరాహమూర్తి, కె.రమేష్, కె.కసవనాయుడు, తాటికొండ శ్రీను, పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.పద్మజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించికపోతే ఈనెల 21న పెన్ డౌన్ కార్యక్రమం చేసి జిల్లా కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేస్తామని తెలిపారు. ఈ నెల 28 నుండి విధులకు నిరవధిక సమ్మె చేస్తామన్నారు. 19 సంవత్సరాల సర్వీసును గుర్తించి తమను గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించి తమ విధులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలం ఫీల్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ నాయకులు ఆర్.సన్యాసిరావు, పి.సంతోషి, డి.రామకృష్ణ, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రావికమతంలో వినతిపత్రాన్ని ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

బుచ్చయ్యపేటలో నిరసన చేపడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

రావికమతం: తమ న్యాయమైన పరిష్కరించాలనిఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బంది పలువురు ఎంపీడీవో వెంకన్న బాబుకు బుధవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా రావికమతం మండల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు మచ్చ శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు దాసరి వరహాలు, కార్యదర్శి శ్రీను, మాజీ అధ్యక్షులు గణేషులు మాట్లాడుతూ, తమను క్రమబద్ధీకరించాలనీ డిమాండ్ చేశారు. మండలాన్ని యూనిట్గా తీసుకొని అంతర్గత బదిలీలు చేపట్టాలన్నారు. జీతాన్ని 26వేల రూపాయలకు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజకుమారి, నూకరాజు, ప్రసాదు, బాబురావు, రామకృష్ణ, సహదేవుడు పాల్గొన్నారు.

పద్మనాభం. మండలంలోని 22 గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సహాయకులు బుధవారం తమ సమస్యలపై పద్మనాభం ఎంపిడిఒ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎంపిడిఒకు విన్నవించారు. తమ సమస్యలపై ఈనెల 16 నుంచ నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు, 21నుంచి వర్క్‌రూల్ పాటించడం, పెన్‌డౌన్, 28 నుంచి పూర్తిగా విధులను బహిష్కరిస్తామన్నారు. ఈ మేరకు వినతిపత్రంలో తమ డిమాండ్లను పేర్కొన్నట్లు ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘం ప్రతినిధులు తెలిపారు.

ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ముకుందరాజుపేట గ్రామంలో ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పంపనబోయిన వెంకట్రావు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నేతలతో కలిసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రవేశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టి, ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో తమ పిల్లలకు ఉత్తమ విద్యా బోధన అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దార్ల నాగరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు దార్ల కృష్ణ, పాఠశాల చైర్మన్ హరికృష్ణ, వైస్ చైర్మన్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రంగబాబు, సతీష్, శివ, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ సీతారామరాజు

త్వరితగతిన నీటి తొట్టెల నిర్మాణం

ప్రజాశక్తి -నక్కపల్లి:వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు తలపెట్టిన నీటి తొట్టెల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు కూలీలకు పనులు కల్పించాలన్నారు. కూలీల కొరత లేకుండా చూడాలని, పని ప్రదేశంలో కూలీలు వేసవి జాగ్రత్తలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంకుడు గుంతలు, ఫారమ్ పాండ్స్ నిర్మాణం, ఉపాధి పనులపై సమీక్షించారు.

బోర్డును ఏర్పాటు చేస్తున్న ఆర్ఐ

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో గుడ్డిప రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమికి రావికమతం రెవిన్యూ సిబ్బంది తహసిల్దార్ డి.వెంకటరమణ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులను బుధవారం ఏర్పాటు చేశారు. సర్వే నెంబరు 44-1లో ఏ 14.45 సెంట్లు, సర్వే నెంబరు 45లో ఏ 3.92 సెంట్లు కొండ పోరంబోకు ప్రభుత్వ భూమిగా సర్వే చేసి గుర్తించారు. దీనికి బుధవారం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సతీష్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్.ఐ సతీష్ మాట్లాడుతూ, మండలంలో గుడ్డిప గ్రామ రెవెన్యూ పరిధిలో కొండ పోరంబోకు భూమిలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బాలాజీ, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

23న ప్రత్యేక సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్.జానకి 87వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 23వ తేదీన సినీ సంగీత విభావరి జరగనుందని యాక్మి అధ్యక్షులు ప్రతాప్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవిపి.కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాక్మిప్రతాప్ మాట్లాడుతూ, జయంతి చౌదరి క్రియేషన్స్, ఎమ్‌విఆర్ ఈవెంట్స్, యాక్మి సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 23వ తేదీన మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఎస్.జానకి పాడిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మిలీనియం శేఖర్ ఆర్కెస్ట్రా సంగీత సహకారంతో జరగనున్న సంగీత విభావరిలో ఈటీవీ స్వరాభిషేకం సింగర్స్ మాళవిక, హితేష్ సాయి తదితరులు జానకి గీతాలను ఆలపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విశ్రాంత న్యాయమూర్తి డి.ధర్మారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త వి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మహిళలు తమ వ్యాపారాల్లో లాభాలు పొందాలంటే ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని డిఆర్‌డిఎ ఏపీడి డైజీ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నెలవారి మండల సమైక్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డైజీ పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ అందిస్తున్న బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తీసుకున్న రుణం జీవనోపాధికి వినియోగించి, తద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. క్రమం తప్పకుండా సమావేశాలు, పుస్తకాల నిర్వహణ పక్కాగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాంకు లింకేజి డిపియం కుమారస్వామి, జిల్లా ఫైనాన్స్ డిపియం శ్రీనివాస్, స్త్రీనిధి ఏజియం వెంకునాయుడు, ఎపి యం శ్రీనివాస్, సీసీలు, గ్రామ సమైక్య సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిడి

ఆర్థిక సాయం చేస్తున్న ప్రసాదాచార్యులు

బాధితుడికి రూ.15 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా మార్చి 10 పదవ తేదీ రాత్రి రథోత్సవం కార్యక్రమంలో భక్తులు రథం లాగుతుండగా వాహన బేరర్‌గా పని చేసిన పొన్నాడ ప్రభాకరాచారి గాయపడ్డాడు. ఈ మేరకు దేవస్థానం ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు స్పందించి బుధవారం ఉదయం కుటుంబ సభ్యులకు 15 వేల ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో మొల్లేటి రాజు, వీరేంద్ర, పొన్నాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న హోం మంత్రి అనిత

బాణాసంచా పేలుడులో..

బాధితులకు రూ.15 లక్షల చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో బాణాసంచా కేంద్రంలో మృతి చెందిన బాధితులకు బుధవారం హోం మంత్రి అనిత రూ. 15 లక్షల చొప్పున చెక్కుల పంపిణీ చేశారు. బాణాసంచా కర్మాగారం వద్ద ఎనిమిది మంది మృతి చెందగా కైలాసపట్నం గ్రామానికి చెందిన వారికి ముగ్గురికి రాజుపేట, చౌడవాడ గ్రామాలకు చెందిన ఒక్కొక్కరికి చెక్కులు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాదిత కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. మృతులలో ఇద్దరు వేరే ప్రాంతానికి సంబంధించిన వారు కావడంతో వారికి కూడా ఎక్స్గ్రేషియా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణ, తహసిల్దారు తిరుమల బాబు, కాసినాయుడు, జానకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న నాయకులు

స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో పీకే పల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించారని బుధ వారం స్థానిక నాయకులు, మాజీ సర్పంచ్ వెంకట రమణ, శ్రీనివాసు తది తరులు తహసిల్దార్ తిరుమల బాబుకు ఫిర్యాదు చేశారు. 2022 సమయంలో గ్రామ కంఠానికి సంబం ధించిన భూమిని అంగన్వాడీ కేంద్రానికి 5.50 సెంట్ల స్థలాన్ని కేటాయించారని, అందులో నాలుగు సెంట్లు లో అంగన్వాడి కేంద్రం నిర్మాణం చేపట్టారన్నారు. ఆట స్థలం మరుగుదొడ్లకు కేటాయించిన స్థలాన్ని స్థానిక నాయకుడు ఆక్రమించుకుని నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న అంగన్వాడి సూపర్వైజర్ నిర్మాణదారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు.

అవార్డు అందుకుంటున్న యేసురాజు

యేసురాజుకు గిన్నిస్ వరల్డ్ రికార్డు

ప్రజాశక్తి-రోలుగుంట: మండల కేంద్రమైన రోలుగుంట గ్రామానికి చెందిన ఫాస్టర్ నాగం యేసురాజు గత ఏడాది డిసెంబరు 1వ తేదీన మ్యూజికల్ స్కూల్లో ఆన్లైన్ సంగీత పోటీల్లో పాల్గొనగా ఈయనకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆన్లైన్లో కీ బోర్డు ప్లే చేసినందుకు గాను ఈయనకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. హెల్లెస్ మ్యూజిక్ స్కూల్ నిర్వాహకులు ఫాస్టర్ అగస్టీన్ దండింగి చేతుల మీదుగా అవార్డును ఈ నెల -14న హైదరాబాద్లో అందుకున్నారు.

రూ.25 లక్షల చొప్పన ప్యాకేజీ చెల్లించాలి

-బోయపాడు గ్రామాన్ని మొత్తం తరలించండి

-ఫిషింగ్ జెట్టీలు నిర్మించాలి

- గ్రామ సభలో ఆర్డిఒకు నిర్వాసితులు, నాయకుల వినతి

డిఎల్ పురంలో ఆర్డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని డిఎల్.పురం, రాజయ్యపేట పంచాయతీ బోయపాడు గ్రామాల్లో వైజాగ్ – చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించేందుకు అర్హుల జాబితాను వెల్లడించేందుకుగాను నర్సీపట్నం ఆర్డిఓ వివి రమణ బుధవారం స్థానిక తహసిల్దారు నరసింహమూర్తితో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమణ మాట్లాడుతూ, 2013 భూసేకరణ ప్రకారం 2024 డిసెంబర్ 31 నాటికి 18 సంవత్సరాలు నిండి ప్యాకేజీ కి అర్హులుగా డిఎల్ పురం, రాజయ్యపేట, బోయపాడు గ్రామాల్లో 346 మంది లబ్దిదారులను గుర్తించి జాబితాను సిద్ధం చేయడం జరిగిందని వెల్లడించారు. వీరిలో ఒక్కొక్కరికి 8 లక్షల 36 వేల రూపాయలు ప్యాకేజీ, పెదబోధిగల్లం రెవిన్యూ పరిధిలో 5 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామన్నారు.

డియల్ పురం లో జరిగిన గ్రామ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, డిఎల్ పురం సర్పంచ్ కిల్లాడి రామకృష్ణ , ఎంపిటీసి సభ్యులు కొండ్ర కనకారావు, మాజీ సర్పంచ్ గింజాల లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకట రమణ తదితరులు మాట్లాడుతూ, ఇళ్లు కోల్పోయిన వారికి రూ.25 లక్షల ప్యాకేజీ, ఉపాధి కోల్పోతున్న వారికి 15 లక్షలు ప్యాకేజీ చెల్లించాలని, డియల్ పురంలో మత్స్యకారులకు జెట్టి ఏర్పాటు చేయాలని, ఇతర భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. బోయపాడు లో జరిగిన గ్రామసభలో ఎంపిటీసీ సభ్యులు పిక్కి సత్తయ్య, నాయకులు పిక్కి కోదండరావు, గ్రామస్తులు మాట్లాడుతూ బోయపాడు గ్రామాన్ని పూర్తిగా తరలించాలని డిమాండ్ చేశారు.సగం ఇల్లు తొలగించి, మిగతా ఇల్లులు తొలగించకపోతే, తొలగించిన ఇళ్లల్లో నివాసం ఉండడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యపడదన్నారు. తొలగిస్తే పూర్తిగా గ్రామాన్ని తొలగించాలని, లేనట్లయితే ఏ ఒక్క ఇల్లు తొలగించకూడదని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. బోయపాడు సముద్ర తీర ప్రాంతంలో మత్స్యకారుల ఉపాధి కొరకు జెట్టినిర్మాణం చేపట్టాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్, గ్రామస్తులు గింజాల శ్రీను, సింహాద్రి, అప్పలరాజు, కొండలరావు,గోవింద్, నూకరాజు,రాజు, యేసు తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహించేదెన్నడో?

-టెండర్ ప్రకటన ఇచ్చి డిపాజిట్లు వసూలు

-అయినా పాటను చేపట్టని వైనం

- డిపాజిట్ దారులు అగ్రహం

పంచాయతీ షాపులు

ప్రజాశక్తి- మాడుగుల: మాడుగుల పంచాయతీ పరిధిలో ఉన్న పంచాయతీ షాపుల వేలంపాట నిర్వహించేందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి డిపాజిట్లు వసూలు చేసి వేలంపాట పెట్టకుండా, డిపాజిట్ల విషయం తేల్చకుండా తాత్సారం చేయడంపై డిపాజిట్ దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలంపాటకు బహిరంగ టెండర్ ప్రకటనిచ్చిన అనంతరం డిపాజిట్లు కలెక్షన్ చేసి పాట పెట్టకుండా ఆ నగదుని అట్టే పెట్టుకున్నారని మండిపడుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు..మాడుగుల పంచాయతీ పరిధిలో ఉన్న 30 షాపులను బహిరంగ వేలంపాట నిర్వహించేందుకు పంచాయతీ పాలకవర్గం తీర్మాణం అనంతరం గత నెల 18న వేలంపాట నిర్వహించేందుకు మార్చి 28వ తేదిన బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్టు టెండర్ ప్రకటన ఇచ్చారు. దీంతో గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకులు, వ్యాపారులు షాపులు పాడుకునేందుకు 114మంది షాప్ కి వెయ్యి రూపాయల చొప్పున 1లక్షా 14వేలు డిపాజిట్ చేశారు. ఇన్చార్జి ఈవోపీఆర్డీ అద్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు పాలకవర్గం సమక్షంలో పాట నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ప్రకారం కొన్ని షాపులను కేటాయించాలని వారు డిమాండ్ చెయ్యగా, పాలకవర్గం ఇప్పటివరకు షాపుల్లో ఉన్న వ్యాపారులకే తిరిగి రెన్యువల్ చేస్తామని చెప్పారు. దీంతో పాలకవర్గ సభ్యులు డిపాజిట్ దారులమద్య వాగ్వివాదం చోటుచేసుకొంది. పాతవారికే రెన్యూవల్ చేస్తే టెండర్ ప్రకటనిచ్చి డిపాజిట్లు కట్టించుకొని షాపుల వేలంపాటలో ఎందుకు కూర్చున్నారని పాలకవర్గాన్ని నిలదీశారు. దీంతో చేసేది లేక పంచాయతీ కార్యదర్శి మరుసటి రోజు మార్చి 29 మధ్యాహ్నం 2గంటలకు వేలం పాట వాయిదా వేశారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ 29వ తేది ఉదయం బహిరంగ వేలంపాటకు టెండర్ ప్రకటన ఇచ్చేందుకు తీర్మానం చేసిన పాలకవర్గం, తిరిగి ఇప్పుడు చెల్లిస్తున్న అద్దెకు 10శాతం అద్దెపెంచి పాతవారికే షాపులు ఇచ్చినట్లు తీర్మాణంచేసి పంచాయతీ కార్యదర్శికి అందించారు. దీంతో, పంచాయతీ కార్యదర్శి నిరవధికంగా ఈ వేలం పాట వాయిదా వేశామని మళ్లీ నోటీష్ బోర్డు పెట్టారు. డిపాజిట్ దారులు పంచాయతీ కార్యాలయం ఎదుట బైటాయించి పాలకవర్గ సభ్యులకు నచ్చినట్లు తీర్మాణం చేన్నారని, ఇదెక్కడి న్యాయమని దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది జరిగి 19రోజులు గడిచినప్పటికీ డిపాజిట్ దారులు కట్టిన డిపాజిట్ నగదుకి అతిగతీ లేదు.దీనిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకొని డిపాజిట్ సొమ్ము ఏం చేశారు. డిపాజిట్ వసూలు చేసి కూడా పాట ఎందుకు నిర్వహించలేదన్న దానిపై విచారణ జరిపి పాట నిర్వహించాలని వారు కోరుతున్నారు.

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబుని అడుగగా ఈ విషయాన్ని డీఎల్పీవో దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని, ఆయన కమిషనర్ దృష్టికి తీసుకొని వెళ్లా రన్నారు. త్వరలో ఏం చెయ్యాలన్నా దానిపై సష్టత వస్తుందన్నారు. 114మంది కట్టిన డిపాజిట్లు బ్యాంక్లో డిపాజిట్ చేశామని తెలిపారు.

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

-రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

రెవెన్యూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, భవిష్యత్తులో భూ వివాదాలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. విశాఖపట్టణం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రీసర్వే పై గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. గ్రామ సభలలో వచ్చిన వినతులు, రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్లో వచ్చే దరఖాస్తులలో అధికంగా ఆర్ఒఆర్, రీ సర్వే, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, 22 ఎ నుండి తొలగింపులు, ఇళ్ల స్థలాల మంజూరుకు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిశీలించి రీఓపెన్ కాకుండా పరిష్కరిస్తున్నట్లు మంత్రికి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వివరించారు. విశాఖలో 22 ఎ లో ఇల్లు ఎక్కువగా ఉన్నాయని వినతులు వస్తున్నాయని, ప్రత్యేకంగా వీటిపై దృష్టి పెట్టినట్లు మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు శ్రీలేఖ, సంగీత్మాదూర్, మండల రెవెన్యూ అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి -రావికమతం: మండలం గొంప శ్రీజ శాండ్ ఎల్.ఎల్. పి లైసెన్స్ యాజమాన్యం లైసెన్స్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, భద్రతా విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే చర్యలు తప్పవని కొత్తకోట సిఐ కోటేశ్వరరావు రావికమతం ఎస్సై రఘువర్మ హెచ్చరించారు. . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేలుడు పదార్థాల మాగజైన్ లైసెన్స్ కలిగి ఉన్నట్లు తనిఖీ చేసి గుర్తించమన్నారు. ఇక్కడికి సమీపంలో నివాసాలు, నిర్మాణాలు ఏమీ లేవని గుర్తించడం జరిగిందన్నారు. జిలేటిన్ మరియు డిటోనేటర్లు వేరుగా నిల్వ చేస్తున్నట్టు తెలిపారు. భద్రతా జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రాజుకు వినతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : వడ్డాది గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వడ్డాది టిడిపి టౌన్ టీడీపీ అధ్యక్షులు దొండా నరేష్ తదితరులు చోడవరం శాసన సభ్యులు కె ఎస్ ఎన్ ఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ బిల్డింగ్స్, పూర్తి చేయాలని, కాపు భవన్ కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టాలని, జల్ జీవన్ మిషన్ ట్యాంకును నిర్మించాలని కోరారు. వడ్డాది రెండు సచివాలయాల్లో సిబ్బంది కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శిథిలావస్థలో ఉన్న మంచినీటి స్థానంలో మరో ట్యాంకును నిర్మాణం చేపట్టాలని తదితర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయం శేషు, దొండా రమేష్, తలారి శంకర్, కోరుకొండ గురుమూర్తి పాల్గొన్నారు

వినతి పత్రాన్ని అందజేస్తున్న దొండా నరేష్, తదితరులు